# ఎక్కడున్నావ్ విజ్జీ

అదే అతని పాలిట శాపంగా మారింది. అలా జరుగుతుందని అనుకోలేదు. భార్యాభర్తల మధ్య ఓ అగాధాన్ని సృష్టించింది కూడా.

ఇప్పుడు చెయ్యగలిగింది ఏమిటి?

నిజాన్ని చెప్పే ధైర్యం అతనికి లేదు. ఒకవేళ చెప్పినా అరుణ సహృదయంతో అతడ్ని అర్ధం చేసుకుంటుందనే నమ్మకం కూడా లేదు. కానీ – నిజం చెప్పేవరకూ అరుణ అతన్ని వదిలిపెట్టేలా కూడా అనిపించటం లేదు.

మొదటిసారిగా తను తొందరపడి ఆ కథ రాసినట్టుగా గ్రహించాడతను.

పావనరావు రచయిత. అప్పుడప్పుడు కథలు రాస్తూవుంటాడు. అలాగే ఇప్పుడు కూడా అతను ఓ కథను రాశాడు. ఎక్కడున్నావ్ విజ్జీ? – అని.

అన్ని కథల్లాగే ఈ కథ కూడా వున్నట్టయితే ఏ రకమైనటువంటి గొడవా జరక్కపోను –

కానీ అలా కాకుండా ఈ కథ పావనరావు అతని భార్య అరుణల మధ్య కలతలను రేపింది.

ఓ వారపత్రికలో పావనరావు రాసిన ఆ కథ నాలుగు రోజుల క్రితం అచ్చయ్యింది. మూడు నెలల క్రితం ఆ కథను ఓ రాత్రి కూర్చుని భార్య ఫెయిర్ చేస్తూ వుంటుంది. కానీ ఈ కథను అతనే ఎందుకో ఫెయిర్ చేశాడు.

నిజానికి అందుకు ప్రత్యేకించిన కారణంఅంటూ లేదు. అప్పట్లో అరుణ ఆరోగ్యం ఏమంత బావుండలేదు. త్వరగా అ కథను పత్రిక్కి పంపించాలని తనే ఫెయిర్ రాసి పంపించాడు.

పత్రికలో అచ్చయిన కథను చదివిన పావనరావుకు సంతోషం కలిగింది. ఎక్కడో వున్న విజయలక్ష్మి తప్పకుండా ఆ కథను చదువుతుందనీ, తన పేరున ఓ ఉత్తరాన్ని ఆ పత్రిక్కి రాస్తుందనీ, వాళ్ళు ఆ ఉత్తరాన్ని తనకు పంపుతారనీ ఊహించి గాల్లో తేలిపోయాడు.

కానీ అతని సంతోషం ఎంతోసేపు నిలువలేదు. ఆ సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన అతని చేతిలోని పత్రిక తీసుకుని ఆ “ఎక్కడున్నావ్ విజ్జీ?” కథను చదివింది అరుణ.

పూర్తిగా చదివిన తరువాత ఆమె మొహంలో రంగులు పూర్తిగా మారిపోయాయి.

"ఎవరీ విజయలక్ష్మి" మీ మాజీ ప్రియురాలా? అనడిగింది కోపంగా.

ఉలిక్కిపడ్డాడు పావనరావు.

ఆమె మళ్ళీ అడిగిన తర్వాత మొహంలోకి నవ్వు తెచ్చుకునే ప్రయత్నం చేస్తూ "ఎవరంటే ఏం చెబుతాం? కథలో ఓ క్యారెక్టర్" అన్నాడు.

అరుణ అతడి మాటలు నమ్మలేదు. నమ్మనట్టుగానే అతడ్ని చూసి "నిజానికి, కల్పనకీ భేదం తెలీనిదాన్ని కాదు. ఈ కథ అన్ని కథల్లాగా లేదు. నేనే కాదు. ఈ కథను చదివిన ఎవ్వరైనా ఇది నిజంగా జరిగిందనే అనుకుంటారు. నిజం చెప్పండి. ఈ విజయలక్ష్మి మీ ప్రియురాలుకదూ?" అంది.

ఒక నిశ్చయానికి వచ్చినవాడిలా వెంటనే "కాదు" అన్నాడతను.

"నమ్మను. నాకు నిజం కావాలి...." అన్నదామె.

"ఇదే నిజం అరుణా.... నన్ను నమ్ము.... నేను ఈ కథను రాసిన తీరు, ఈ కథకు పెట్టిన టైటిల్ వల్ల నువ్విలా అనుకుంటున్నావ్.... నిజానికి ఇది ఓ మామూలు కథ. కేవలం ఊహించి రాసిన కథ. నువ్వు ఏదేదో ఊహించుకుని నన్ను అనుమానించకు.... ప్లీజ్...." అన్నాడు పావనరావు నటిస్తూ.

అతనెంతగా నటించినా ప్రయోజనం లేకుండాపోయింది. అరుణ అతని మాటలు నమ్మలేదు. అతనితో వారించి ఉపయోగం లేదని చేసేదేం లేక మవునంగా వుండిపోయింది.

ఆ రాత్రి పావనరావు సరిగా భోజనం చెయయలేకపోయాడు. భార్య అతనితో మాట్లాడలేదు. ఆమెకు తనమీద అనుమానం తీరలేదనీ, అందుకే కోపంగా వుందనీ అతనికి తెలుసు. కాబట్టి ఆమెను పలకరించే ప్రయత్నం చెయ్యలేదు.

పడుకున్నారిద్దరూ చెరోవైపుకీ తిరిగి.

ఇక అప్పుడు అతని కనులముందు విజయలక్ష్మి ప్రత్యక్షమయ్యింది. అతడికి నవ్వొచ్చింది. తనకు తెలియకుండానే తన మనసులో వున్నదంతా ఆ కథలో రాసేశాడు. అందుకే తన భార్య తనని అంతగా అనుమానించింది. తను నిజం కాదని చెప్పినా నమ్మటంలేదు.

ఇప్పటికీ విజయలక్ష్మి మీద తనకు అంతటి ప్రేమ వున్నదా? తల్చుకుంటే

ఆశ్చర్యంగా వుంది.

దాదాపు ఆరేళ్ళ క్రితం ఇద్దరూ విడిపోయారు. తిరిగి కలుసుకోలేదు. అప్పుడప్పుడు విజయలక్ష్మి గుర్తుకువస్తున్నా ఈమధ్య ఆమె తలపులూ, రూపం, జ్ఞాపకాలూ తనని వేధించసాగాయి. ఎలాగయినా విజయలక్ష్మిని కలుసుకోవాలి. ఆమెతో మాట్లాడాలి... కోరిక తీవ్రతరమయ్యింది.

పర్యవసానం ఈ కథ – విజయలక్ష్మి. గుర్తుకువస్తున్నకొద్దీ ఆమె గురించిన ఆలోచనలన్నీ ఒకటొకటిగా అతడిని ఆక్రమించసాగాయి.

అంత అందంగా వుండదు ఆమె. అయితేనేం? ఎదుటి మనిషిని తన మాటలతో ఆకట్టుకునే నేర్పరితనం ఆమెలో వుంది. కొంచెం నల్లగానే వుంటుంది. మొహాన ఎప్పుడో పోసిన స్ఫోటకం తాలూకు నల్లని మచ్చలు, ఒత్తుగా లేని జుట్టు" అంటూ పొడవు కాని జడ, చిన్న నోరు, పలుచని పెదవులు, నుదుటిమీద సన్నని దోసగింజంత బొట్టు.

నవ్వుతూ మిలమిలలాడుతున్నట్టుండే కళ్ళు. ఆ కళ్ళలో ఎన్నో కాంతినక్షత్రాలు.

అన్నింటికంటే విజయలక్ష్మి చొరవ తనని ఎక్కువగా ఆకర్షించింది. ఒకే కాలేజీలో బియ్యే చదువుతోంది ఆమె – తను బికాం. పరీక్షలు జరుగుతున్నప్పుడు ఇద్దరూ ఒకే బెంచీమీద కూర్చున్నారు. తను ఏమీ రాయకపోవటం చూసి "చూట్టానికి తెలివిగలవాడిలా వున్నావ్? ఏమీ రాదా?" అనడిగింది ఆమె. తను ఆశ్చర్యపోయాడు. ఆమే చెప్పింది.... అలా జరిగింది పరిచయం.

ఆ పరిచయం స్నేహంగా మారకముందే తను రాసిన ఓ కథ అచ్చయ్యింది. ఆ విషయాన్ని ఎవరో విజయలక్ష్మికి చెప్పారుట.

ఓ రోజు కాలేజీలోనే పట్టుకుని "కంగ్రాట్స్ రావ్.... కథ బావుంది. ఇంతకీ కథ రాసినందుకు నన్ను సినిమాకు తీసుకెళ్ళవూ?" అనడిగింది. ఆమె చొరవకు మళ్ళీ ఆశ్చర్యపోయాడు.

తను వెంటనే చొరవతో ఆమెను సినిమాకు తీసుకెళ్ళలేకపోయాడు. కానీ కొన్నిరోజులకు విజయలక్ష్మితో సినిమాకు వెళ్లాడు.

ఆ తర్వాతనించీ విజయలక్ష్మితో స్నేహం క్రమంగా పెరిగిపోయింది. తన జీవితంలో నూతనతేజం ప్రవేశించినట్టు అనిపించింది.

ఉన్నట్టుండి పావనరావు ఆలోచనలకు అంతరాయం కలిగింది. ఎందుకంటే

అతని భార్య మంచంమీదినించి కిందికి దిగి ఒక్కసారి పావనరావును చూసి పక్కనే వున్న గదిలోకి వెళ్ళింది.

కొన్ని నిముషాలకు అతను కూడా లేచి ఆ గదిలోకి వెళ్ళాడు. లైటు వెలుతురులో ఓ చెక్కపెట్టె తెరచి అందులో వున్న కాయితాలను బయటకు తీస్తూ కనపడింది. అతనికి ఒకేసారి కోపమూ, ఆశ్చర్యమూ కలిగాయి.

ఎందుకంటే ఆమె చేస్తున్నదేమిటో అతనికి తెలుసు. ఆ చెక్కపెట్టెలో ఎన్నో యేళ్ళనాటి ఉత్తరాలు, పత్రికలునించి తిరిగివచ్చిన కథలూ వున్నాయి.

ఒక్కో ఉత్తరాన్ని తీసి చదువుతున్నది ఆమె - రెండు నిముషాలు అక్కడే నిలబడి తర్వాత అక్కడినించి వచ్చి మంచంమీద వాలిపోయాడు.

ఇలా జరుగుతుందని ఊహించకపోయినా విజయలక్ష్మి తనకు అప్పుడప్పుడు రాసిన ఉత్తరాలను పెళ్ళికి ముందుగానే చించేశాడు.

అతడిలో అలోచనలు తిరిగి మొదలయినాయి. అలా ఆలోచిస్తూనే అతను నిద్రలోకి జారిపోయాడు. ఆ తరువాత భార్య ఎప్పుడు వచ్చి పడుకున్నదీ అతడికి తెలీదు.

తెల్లారి లేచాక "ఇప్పటికయినా నామీద నీ అనుమానం తీరిందా అరూ" అన్నాడు పావనరావు చాలా సౌమ్యంగా.

అతడిని తీక్షణంగా చూస్తూ "రచయితగారు కదా.... మీ ప్రేమలేఖల్ని దొరకనిస్తారా?" అన్నది.

పావనరావు చిన్నగా నవ్వి "నిజంగా నీది అనుమానం. ఇప్పటికయినా నమ్ము.... విజయలక్ష్మి ఓ కల్పిత పాత్ర" అన్నాడు.

పైకి అలా అన్నాడేగానీ ఇతడికి మనసులో భయం కలిగింది. తను కథలో సూచించినట్టుగానే కథ పడిన పత్రికద్వారా విజయలక్ష్మి తనని కలుసుకోగలిగితే? ఆ పరిస్థితిలో తనేం చెయ్యాలి? అరుణకు ఏమని చెప్పాలి?

"నమ్మను. విజయలక్ష్మి నిజంగానే వుంది. ఉన్నది కాబట్టే ఆమె మిమ్మల్ని ఎలా కలుసుకోవచ్చునో కథలోనే మార్గం సూచించారు. ఒకటిమాత్రం నిజం. ప్రస్తుతం ఆ విజయలక్ష్మి ఎక్కడ వున్నదో మీకు తెలీదు. మీరు రాసిన కథ చదివి మిమ్మల్ని కలుసుకోవాలి. అదే మీ ప్లాను.... ఇప్పటికీ నిజం చెప్పకపోతే మీరు ఊహించినట్టుగా రేపు ఆ విజయలక్ష్మి వచ్చినప్పుడైనా నిజం తెలిసిపోతుంది. అప్పుడు మీరు తప్పించుకోలేరు" అన్నది.

భార్య అలా అన్న తర్వాతకూడా అతను విజయలక్ష్మి నిజంగానే వున్నదనీ ఆమెకీ, తనకీ మధ్య కొన్నేళ్ళ క్రితం ప్రేమాయణం నడిచిందనీ చెప్పలేకపోయడు. ఇక భార్యను నమ్మించటం తనకు సాధ్యం కాదనీ, తను రాసిన కథ అలాంటి బలమైన అభిప్రాయాన్ని కలిగించిందనీ అతడు అనుకున్నాడు. అలా అనుకున్న తర్వాత అతడు ఆమెను నమ్మించే ప్రయత్నం చెయ్యలేదు.

ఇలా మరో నాలుగు రోజులు గడిచాయి.

ఈ నాలుగు రోజులూ ఇద్దరూ మాట్లాడుకోలేదు. ఇంతకుముందు ఎప్పుడూ అతనికి ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. అలా భార్యకు దూరంగా వుండటం అతడికి బాధను కలిగించింది.

పోనీ.... విజయలక్ష్మి గురించి చెప్పేద్దామా అనిపించింది. కానీ అది మరింత ప్రమాదమనిపించింది. జీవితాంతం తనను సాధిస్తూనేవుంటుంది. ఆమె మనస్తత్వం తనకు బాగా తెలుసు.

కానీ తను పొరపాటు చేశాడు. తన ఎడ్రసు తెలుసుకుని విజయలక్ష్మి తనకు ఉత్తరం రాసినా తనకంటే ముందుగా ఆ ఉత్తరాన్ని అరుణ చూస్తుందనే ఆలోచన తనకు రాలేదు. పోస్ట్‌మేన్ వచ్చే సమయంలో తను ఆఫీసులో వుంటాడు.

ఇప్పుడు చెయ్యగలిగింది ఏదీ లేదు. ఐనా విజయలక్ష్మి తను రాసిన కథ చదవాలి. తనకీ ఇంట్రస్టు వుండాలి. తనని కలుసుకోవాలని అప్పుడు తనకో ఉత్తరం రాయాలి.

ఇదంతా జరిగేనా?

ఆరోజు రాత్రి అరుణ భర్తతో చెప్పింది తను పుట్టింటికి వెళ్ళి ఓ వారంరోజులు వుండి వస్తానని.... వెంటనే ఒప్పుకున్నాడతను.

ఆమె మనసు బాగోలేదని అతడికి తెలుసు. అంతేకాదు. ఆమె ఊరికి వెళ్ళడం తనకూ మంచిదే. విజయలక్ష్మి స్వయంగా వచ్చినా, ఓ ఉత్తరం రాసినా, ఫోన్ చేసినా తనకు భయం వుండదు.

మరురోజు ఉదయమే అరుణ రాజమండ్రి వెళ్ళిపోయింది పుట్టింటికి.

గొప్ప రిలీఫ్ ఫీలయ్యాడు అతను.

ఆ రాత్రి మంచంమీద అతనొక్కడే. మళ్ళీ విజయలక్ష్మి గురించిన ఆలోచనలూ, ఆమెతో కలిసి తిరిగిన జ్ఞాపకాలూ అతడిని ఆక్రమించుకున్నాయి.

తను కొన్నాళ్ళు హైద్రాబాద్‌లో ఉద్యోగం చేశాడు. ఓ ప్రయివేటు కంపెనీలో.... అప్పుడు ఎమ్మే చదువుతూ విజయలక్ష్మి ఓ గదిలో వుండేది. ఆమె తల్లిదండ్రులు మరేదో ఊళ్ళో వుండేవారు. తను సెలవుపెట్టి ఇంటికి వచ్చినప్పుడు తరిగి హైదరాబాద్ వెళ్ళటానికి బస్టాండుకు వెళుతూ మధ్యలో విజయలక్ష్మి దగ్గరకు వెళ్ళేవాడు.

ఆమె కూడా తనలో వచ్చి రాత్రి పదిన్నరకు తనని హైదరాబాద్ బస్సు ఎక్కించి వెళ్ళేది. ఒకసారి తన అక్కయ్య తనకోసం తెచ్చి ఇచ్చిన లడ్డూలను తనకు ఇచ్చేసింది.

ఇద్దరూ కలిసి కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే ఊరి బయట పొలాలగట్టుమీదకు వెళ్ళి కూర్చుని ఇంగ్లీషు నవల్లు చదివేవారు.

తను ఏదయినా వూరు వెళితే అక్కడినించే విజయలక్ష్మికి ఉత్తరం రాసేవాడు.

ఆమెతో స్నేహం ప్రేమగా మారిన తర్వాత తనకు ఉద్యోగం వచ్చింది.

సరిగ్గా తనకు ఉద్యోగం వచ్చిన మూడు నెల్లకే తన తండ్రి ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది.

తండ్రి బలవంతంమీద ఆయన స్నేహితుడి కూతురయిన అరుణను పెళ్ళి చేసుకోకతప్పలేదు. తనకు పెళ్ళయిన తర్వాత కొంచెం గిల్టీగా ఫీలయి విజయలక్ష్మిని కలవలేదు. ఆపైన ఉద్యోరీత్యా ఆమెకు దూరంగా వెళ్ళిపోయాడు. తర్వాత తను ఉత్తరాలు రాయటానికి సాహసించలేకపోయాడు. అలా ఇద్దరూ ఒకరినొకరు దూరమైపోయారు.

ఇప్పుడు విజయలక్ష్మి ఎక్కడ వున్నదో?

తెల్లవారింది. అతను ఆఫీసుకెళ్ళబోతున్న సమయంలో ఫోన్ మోగింది.

"హలో" అన్నాడతను.

"నేను విజ్జీని.... ఎవరు? పావనరావేనా?"

అతనికి గుండె ఆగినట్లనిపించింది.

"నేనే" అన్నాడు గొంతు పెగల్చుకుని.

"నీ కథ చదివాను. ఆ పత్రికవాళ్ళనడిగే నీ ఫోన్ నెంబరు తెలుసుకున్నాను. రేపు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరుతున్నాను. మధ్యాహ్నం స్టేషన్లో మనం కలుసుకుందాం...."

ఇంకేదో అడగబోయాడతను. "అన్నీ కలుసుకున్నాకనే.... వుంటాను.... బై" ఫోన్ పెట్టేసింది.

ఒక్క క్షణం స్థాణువులా అక్కడే నిలబడిపోయాడు అతను. కలో, నిజమో అర్థంకాలేదు. తను ఏ ఉద్దేశంతో ఆ కథ రాశాడో, ఆ ఉద్దేశం నెరవేరబోతున్నది. అయితే విజయలక్ష్మి విశాఖపట్నంలో వుంటోన్నదా?

మరురోజు రైలు రావటానికి అరగంట ముందుగానే స్టేషన్‌కు వెళ్ళాడు పావనరావు. పది నిముషాలు ఆలస్యంగా వచ్చింది ప్రశాంతి ఎక్స్‌ప్రెస్.

జనం దిగుతున్నారు.

విజయలక్ష్మికోసం వెతుకుతున్నాడు అతను. ఇంతలో హఠాత్తుగా అతడికి అరుణ కనిపించింది. కనిపిస్తూనే అతడికి దగ్గరగా వచ్చి, "విజయలక్ష్మికోసమేనా చూస్తున్నారు?" అన్నది సీరియస్‌గా.

"అంటే" అన్నాడతను.

"విజయలక్ష్మి బాగా మా ఫ్రెండ్‌చేత రాజమండ్రి నించి నేనే ఫోన్ చేయించాను"

అతనింకా షాక్‌నించి తేరుకోకముందుగానే "హలో పావనరావ్.... నేను ఈ రైల్లో వస్తున్నట్టు నీకెలా తెలుసు? ఏ కథ చదివాను.

నీ కథ పడిన పత్రికవాళ్ళ ద్వారా నీ ఎడ్రసు తెలుసుకున్నాను" అన్నది ఒకామె వాళ్ళ దగ్గరకు వచ్చి. ఆమెను సులభంగానే గుర్తించాడు అతను. అంతగా మార్పు లేదు ఆమెలో.

ఆమే విజయలక్ష్మి.

"నువ్వా" అన్నాడు విస్మయంగా....

"ఇంతకీ ఈమె ఎవరు?" అన్నది విజయలక్ష్మి" అరుణను చూస్తూ.

అతనికి సంతోషమూ, దుఃఖమూ ఒక్కసారిగా ముంచుకొచ్చేశాయి. ❖

*స్వాతి మాసపత్రిక, అక్టోబర్ 2001*